దాశరథీ శతకము ~ 99

**ఉ: బొంకనివాడె యోగ్యు దరిబృందము లెత్తిన చోట జివ్వకుస్**

**జంకనివాడె జోదు, రభసంబున నర్థి కరంబు సాచినస్**

**గొంకనివడె దాత, మిము గొల్చి భజించినవాడెపో నిరా**

**తంకమనస్కు డెన్నగను, దాశరథీ కరుణాపయోనిధీ**

భావము

ఓ దశరథరామా! జీవితములో అసత్యము మాట్లాడనివాడే యోగ్యుడు ~ గౌరవమైనవాడు. శత్రువులు దండెత్తగా వారితో పోరాడడానికి వెనుకాడక భయపడక ఎదురించువాడే మహాయోధుడు. అవసరమున్నవాడు ~ కోరిక కలిగినవాడు ~ దానము ఇమ్మని చేయి చాపితే ఎలాంటి సందేహములేక దానము చేసేవాడే దాత. ఈ పని వెంటనే చేయవలనట ~ మిమ్ములను అనగా దైవాన్ని సేవించి సంకీర్థనము చేసేవాడే నిర్మలమైన ఆటంకములేని స్వచ్ఛమైన మనస్సు కల వాడు.

వ్యాఖ్య

ధనధాన్యాలు సంపాదించి వాటిన దాచిపెట్టినంత మాత్రము సరిపోదు ~ లోకములో అవసరము కలవారు ~ అర్థులు ~ ధనవంతులను అర్థించడమున్నది. కానీ ధనవంతులలో చాలామంది భోగులే ~ ఇతరుల అవసరాన్ని గుర్తించి వారు కోరిన వెంటనే వారికి సహాయము చేసేవాడే

నిజమైన దాత. అంతేకానీ పదిసార్లు బ్రతిమాలించుకుని అవసరానికి సహాయాన్ని చేయకపోతే వాడి ధనము దేనికి?దాతృత్వము దేనికి?

సమాజములో అసత్యమాడనివాడు మోసగాడు కాలేడు. హరిశ్చంద్రాది చక్రవర్తులు ఆచంద్రతారార్కమైన కీర్తిని గడించినారు. అట్టివారికంటే మరి యోగ్యులెవరు?

అస్తిత్వమే ప్రధాన లక్షణము ~ అందుకే పరమాత్ముని సేవించి భజించినవాడే నిష్కళంక మనస్కుడైనవాడు ~ సచ్ఛీలుడు ~ యోగ్యుడు ~ వీరుడు ~ దాత ~ అవుతాడు.

ఈ విషయాలను సామాజిక స్పృహతో స్పృశించినాడు కవి ఈ పద్యములో!

**చ: భ్రమరము కీటకంబు గొని పాల్పడి ఝుంకరణోపకారియై**
**భ్రమరముగా నొనర్చునని పల్కుటజేసి, భవాదిదుఃఖ సం**
**తమసమెడల్చి భక్తి సహితంబుగ జీవుని విశ్వరూప త**
**త్త్వమున ధరించుటేమరుడు? దాశరథీ కరుణాపయోనిధీ**

భావము

తుమ్మెద ఒక పురుగును స్వీకరించి దాని కొరకై పూనుకొని తన ఝుంకారముచేత, ఉపకారము(మేలు) చేసి దాన్నికూడా తుమ్మెదగా మార్చునని లోకములో చెప్పుకొంటారు. నీవు మానవుడు జన్మించినది మొదలుకుని దుఃఖమనే అంధకారాన్ని నిర్మూలించి అతనిలో భక్తిని

కలిగించి దాని వలనీ విశ్వరూప తత్త్వాన్ని ధరింపజేస్తావు. దీనిలో ఆశ్చర్యమేమున్నది? ఆశ్చర్యము లేదని తాత్పర్యము.

వ్యాఖ్య

భ్రమ కీటక న్యాయము అనే ఒక సంప్రదాయముంది కదా! దీనిశాస్త్రపద్ధతిలో ~ తుమ్మెద గుడ్డు పెట్టిన తరువాత కొంతకాలానికి కాళ్ళు కలిగిన పురుగులాగా (Caterpillar) మార్పు చెందుతుంది. ఆ తరువాత దానికిరెక్కలొచ్చి తుమ్మెదగా స్వరూపాన్ని సంతరించుకుంటుంది. ఈ మూడు దశల్లోనూ తల్లి తుమ్మెద గూటిచుట్టూ తిరుగుతూ ఝుంకారము చేస్తుంది. ఝుంకారమువల్ల కీటకానికి తెమ్మెద రూపమొచ్చిందని కవులు భావిస్తారు కానీ ఇది ప్రకృతిసిద్ధమైన త్రిదశ పరిణామము. పక్షులు రెండు దశల్లో ~ అండము ~ పక్షి ~ పరిణామము చెందినట్టిదే ఇది కూడా! మానవుడు దుర్బలుడు ~ అతడు ఏ ఘనత పొందినా భగవదనుగ్రహము వల్లనే ~ అని కవి సూత్రప్రాయముగా ప్రతిపాదించి నాడు.

**చ: తరువులు పూచి కాయలగు దత్కుసుమంబులు పూజగా భవ**
**చ్చరణము సోకి దాసులకు సారములై ధనధాన్యరాసులై**
**కరి భట ఘోటకాంబర నికసూములై విరజానదీ సము**
**త్తరణమొనర్చు జిత్రమిది దాశరథీ కరుణాపయోనిధీ**

భావము

ఓ దశరథరామా! చెట్లు పుష్పించి పూవులు, అక్కడనే ఉండినట్లైతే, అవి కాయలుగా మారుతాయి ~ పూవులనే కోసి నీ భక్తులు వాటిని నీ పాదములందు పూజార్థము సమర్పించగా, అవి నీ అడుగులు సోకగానే నిన్ను సేవించినవారికి మేలైన ధనధాన్యములుగానూ, ఏనుగులుగానూ, బంట్లుగానూ, గుర్రములుగానూ, వస్త్రములుగానూ పరిణమించి ఈ లోకములో సౌఖ్యాలను కలిగిస్తున్నాయి. చివరన పరమపదములో ఉండే విరజానదిని దాటించి స్వర్గసౌఖ్యాన్ని అందిస్తున్నాయి. నీ పూజా మహిమ ఇట్టిది కదా!

వ్యాఖ్య

గోపన్న ఈ పద్యములో మానవులందరూ భగవంతునికి భక్తులుగా ఉండాలని ~ భక్తిలో ప్రధానంగమైన పూజ భగవంతునికి వారు నిర్వర్తించవలెనని, దానివలన ఇహలోక సౌఖ్యాలే కాక పరలోక సౌఖ్యము కూడా సులభము అవుతుందని అందమైన భావముతో సందేశాన్ని అందించినాడు.

**ఉ: పట్టితి భట్టరార్య గురు పాదములిమ్మెయి నూర్ధ్వపుండ్రముల్**
**బెట్టితి, మంత్రరాజ మొడిబెట్టితి, నయ్యమకింకరాళి కిం**
**గట్టితి బొమ్మ, మీ చరణ కంజములందు దలంపు పెట్టి పో**
**దట్టితి పాప పుంజముల, దాశరథీ కరుణాపయోనిధీ**

భావము

ఓ దశరథరామా! నేను భట్టరాచార్యులవారి శిష్యుడనై, తిరుమణిశ్రీచూర్ణములను ధరించినాను ~ వారివలన తిరుమంత్రము ఉపదేశాన్ని పొందినాను. మీకు భక్తుడనై మీ పాదాలను సదా ధ్యానించి సమస్త పాపాలనుండీ వైదొలగినాను. ఈ నాలుగు పనుల సహాయముతో యమభటులను ఎదిరించి నరకమునుండీ తప్పించుకొన్నాను. ఇంక నాకు ఏమి కావాలి ప్రభూ!

వ్యాఖ్య

ఇందులో గోపన్న కవి తన ఆత్మకథను క్లుప్తముగా విన్నవించి ఉన్నాడు. వైష్ణవులు ద్వాదశ ఊర్ధ్వ పుండ్రములను ధరించడము సంప్రదాయము. గురువు అనుగ్రహాన్ని పొందినాడన్నాడు. పూర్వము శ్రీమద్రామానుజులు తమ గురువు వద్ద ఉపదేశమును పొంది ఆలయగోపురమెక్కి సర్వజనులకూ తిరుమత్రోపదేశము చేసినారని ~ వారిని నరకమునుండీ తప్పించినారనీ చెప్పినాడు. తాను రాముని పాదసేవకుడినన్నాడు. భక్తుడైనవాడు ఈ దశలనన్నిటినీ గడచి శ్రీరాముని సేవించి తరిస్తారని ఈ పద్యములో తన భావాన్ని తేటతెల్లము చేసినాడు.

**ఉ. అల్లన లింగ మంత్రి సుతు డత్రిజు డాదిశాఖ కం**

**చెర్ల కులోద్భవుండ బ్రసిద్ధుడనై భగదంకితంబుగా**

**నెల్లకవుల్ నుతింప రచియించితి గోపకవీంద్రుడన్ జగ**

**ద్వల్లభ నీకు దాసుడను దాశరథీ కరుణాపయోనిధీ**

భావము

ఓ దశరథరామా! నేను లింగమంత్రి కుమారుడను ~ ఆత్రేయ గోత్రమునకు  చెందినవాడను ~ శుక్ల యజుర్వేద శాఖ ~ కంచెర్ల వంశము ~ పేరు గోపన్న కవి ~ నీకు దాసుడనై కవులందరునూ పొగడగా ఈ శతకాన్ని రచించి నీము అంకితము అర్పణ చేసినాను.

వ్యాఖ్య

ఇందులో కవి తన గోత్రనామాదులను చెప్పినాడు. కావ్యాన్ని అంకితము చేయడము ఆంధ్రకవుల సంప్రదాయమే. ఇది భూపతులకు గానీ, లేక తమకు ఇష్టమైనవారికి గానీ అంకితము చేయవచ్చును. ఈ గోపన్న కవి తన దాశరథీ శతకాన్ని భద్రాచల  శ్రీరామచంద్రునికి అంకితము చేసి రామదాసు అనే సార్ధక నామాన్ని గ్రహించినాడు.

**ఇంతటితో దాశరథీ శతక పద్యాలు, తాత్పర్యాలు, వ్యాఖ్యలు సమాప్తము.**